
ఆంధ్రజ్యోతి

andhrajyothy.com



ఆదిలాబాద్
జిల్లా వార్తలు

5

సోమవారం 22 సెప్టెంబరు 2025



మాట్లాడుతున్న రాష్ట్ర అధ్యక్షుడు మర్సుకోల తిరుపతి

తోటి గిరిజనుల సంక్షేమానికి కృషి చేయాలి

● బిరుదుగోండు తోటి సేవా సంఘం రాష్ట్ర అధ్యక్షుడు

ఉట్నూర్, సెప్టెంబరు 21(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని తోటి గిరిజనుల సంక్షేమం, అభివృద్ధి కోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కృషి చేయాల్సిన అవసరం ఉందని ఆదివాసం బిరుదు గోండు తోటి సేవా సంఘం రాష్ట్ర అధ్యక్షుడు మర్సుకోల తిరుపతి డిమాండ్ చేశారు. ఆదివారం మండల కేంద్రంలోని ఆదివాసీ భవన్‌లో నిర్వహించిన బిరుదుగోండు తోటి సేవా సంఘం రాష్ట్ర అధ్యక్షుడు మర్సుకోల తిరుపతి అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో పలు తీర్మానాలు చేయడం జరిగిందన్నారు. అక్టోబర్ 26న గిరిరత్న వెడ్మరాము వర్ధంతి కార్యక్రమాన్ని ప్రభుత్వం అధికారికంగా చేపట్టాలన్నారు. తోటి గిరిజనులకు సంబంధం లేనివారు కొందరు నకిలీ పేర్లతో బోగస్ సర్టిఫికెట్లు తీసుకుంటున్నారని, అలాంటి వాటిని అరికట్టాలన్నారు. అంతరించి పోతున్న తోటి ఆదివాసీ తెగ గిరిజనులను కాపాడడానికి ప్రయత్నం చేయాలన్నారు. ప్రతీ తోటి గిరిజన కుటుంబానికి ఇళ్లు మంజూరు చేయాలని, గతంలో ఐటీడీఏ ద్వారా నిర్మించిన ఇళ్లకు సకాలంలో బిల్లులు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. తోటియువతి యువకులకు బీఎస్సీ నర్సింగ్, పారామెడికల్, స్టాఫ్‌నర్సింగ్ కోర్సులలో ఉచిత ప్రవేశాలు కల్పించి శిక్షణ పూర్తి చేసే వారికి ఉద్యోగ అవకాశాలు కల్పించాలన్నారు. పీవీటీజీల కోసం ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు చేయాలన్నారు. ప్రతీ తోటి కుటుంబానికి రూ.10 లక్షల ప్రమాద బీమా సౌకర్యం కల్పించాలన్నారు. ఈ సమావేశంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తొడసం శ్రీనివాస్, చాకటి దస్రు, కుమ్ర మోతీరామ్, వెంకటేశ్, పృథ్వీరాజ్, శ్రీదేవి, శ్రీధర్, పవన్‌కుమార్, అశోక్, ప్రవీణ్, గోవర్ధన్, దత్తు, గోపాల్, తదితరులు పాల్గొన్నారు.


గ్రామసభలు నిర్వహించాలి : డీడీ

ఉట్నూర్, సెప్టెంబరు 21(ఆంధ్రజ్యోతి): కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న ఆదికర్మ యోగి అభియాన్ కార్యక్రమాలు విజయవంతం కావడానికి అక్టోబరు 2న గాంధీ జయంతి సందర్భంగా గ్రామాలలో గ్రామసభలు ఏర్పాటు చేసి గ్రామాల అభివృద్ధికి ప్రణాళికలు పూర్తి చేయాలని గిరిజన సంక్షేమ శాఖ డిప్యూటీ డైరెక్టర్ అంబాజి జాదవ్ అధికారులను ఆదేశించారు. మండల కేంద్రంలోని కొమురంభీం ప్రాంగణంలో ఉన్న పీఎంఆర్సీ సమావేశ మందిరంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఆదికర్మయోగి అభియాన్ ద్వారా మండల స్థాయి మాస్టర్ ట్రేనీలు గ్రామస్థాయిలో అవగాహన కార్యక్రమాలు ఏర్పాటు చేసి ఆయా గ్రామాలకు కావాల్సిన మౌలిక వసతులు, అభివృద్ధికి సంబంధించిన గ్రామ ప్రణాళికలు తయారు చేసి గాంధీ జయంతి సందర్భంగా గ్రామసభలలో ఆమోదం పొందాలని పేర్కొన్నారు. ఇందులో అకాడమిక్ మానిటరింగ్ సెల్ అధికారి ఆత్రం జగన్, పెస కో ఆర్డినేటర్ అరకవసంతరావు, ఏటీడీఓలు క్రాంతికుమార్, అమిత్‌కుమార్, నిహారిక, తదితరులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న నిరవధిక సమ్మె

ఉట్నూర్, సెప్టెంబరు 21(ఆంధ్రజ్యోతి): సమస్యలు పరిష్కరించాలని గిరిజన సంక్షేమ శాఖ ఆశ్రమ పాఠశాలలు, వసతి గృహాలలో పని చేస్తున్న దినసరి ఉద్యోగులు, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులు తలపెట్టిన సమ్మె పదవ రోజుకు చేరింది. ఆదివారం సైతం సెలవు లేకుండా దినసరి ఉద్యోగులు మండల కేంద్రంలోని ఐటీడీఏ కార్యాలయం ముందు నిరవధిక సమ్మె నిర్వహించి సమస్యలు పరిష్కరించాలని ప్రభుత్వాన్ని కోరుతున్నారు. పది నెలలుగా వేతనాలు లేక ఆర్థిక ఇబ్బందులతో సతమతం అవుతున్నామని ప్రభుత్వం వెంటనే వేతనాలు చెల్లించాలని డిమాండ్ చేస్తున్నారు. యూనియన్ సభ్యులు ఏరుకొండ రాజన్న, బానోత్‌మాణిక్‌రావు, రా థోడ్‌బాపురావ్, బింగి నరసింహులు, తదితరులున్నారు.





● ఉట్నూర్‌లోని జీసీసీ డివిజనల్ మేనేజర్ కార్యాలయం

ఆశయం ఘనం.. ఆచరణలో శూన్యం

- జిల్లాలో శిథిలావస్థలో జీసీసీ (గిరిజన సహకార సంస్థ) భవనాలు
- రేషన్ బియ్యం పంపిణీకే పరిమితం
- నిధులు రాక నీరసం
- నిలిచిపోయిన అటవీ ఉత్పత్తుల కొనుగోళ్లు
- గోదాములలో మూలుగుతున్న ఇప్పపువ్వు నిల్వలు

ఉట్నూర్, సెప్టెంబరు 21(ఆంధ్రజ్యోతి): మారుమూల గిరిజన గ్రామీణ ప్రాంతాల ప్రజలకు సేవలు అందించాలని గొప్ప ఆశయంతో ఏర్పాటు చేసిన గిరిజన సహకార సంస్థ సేవలు ఆచరణలో విఫలం అవుతున్నాయి. ఉమ్మడి జిల్లాలోని గిరిజనులకు సేవలు అందించడానికి ఉట్నూర్, ఇచ్చోడ, ఆదిలాబాద్, సిర్పూర్ కాగజ్‌నగర్, జన్నారం, ఆసిఫాబాద్ ప్రాంతాలలో 110 డీఆర్ డిపోలను గిరిజన సహకార సంస్థ అధికారులు ఏర్పాటు చేశారు.

శిథిలావస్థలో డీఆర్ డిపోలు

ఐదు దశాబ్దాల క్రితం నిర్మించిన డీఆర్ డిపోల భవనాలు శిథిలమయిపోతుండగా.. ఉట్నూర్ మండల కేంద్రంలో ఉన్న గిరిజన సహకార సంస్థ డివిజనల్ కార్యాలయం సైతం శిథలదశకు చేరింది. ఉట్నూర్ సొసైటీ పరిధిలో ఉన్న లోకారి, నార్నూర్, భీంపూర్, కొత్తపల్లి(హెచ్), అల్లంపల్లి, కేస్లాపూర్, హస్నాపూర్, ఉషేగం, ఆశపల్లి, పాట్నాపూర్, సేట్నూ ర్, లింగాపూర్ ప్రాంతాలలో ఉన్న డీఆర్ డిపోల భవనాలు శిథిల దశకు చేరడంతో అక్కడ సిబ్బంది భయంభయంగా విధులు నిర్వహిస్తున్నారు. ఉట్నూర్‌లోని డివిజనల్ మేనేజర్ కార్యాలయంతో పాటు సీనియర్ మేనేజర్ కార్యాలయం సైతం ఉన్న భవనం శిథిల దశకు చేరింది. 35 ఏళ్ల క్రితం నిర్మించిన భవనం పైకప్పుకు పగుళ్లు రావడంతో వర్షపు నీరు లోనికి వచ్చి సిబ్బంది ఇబ్బందులు పడుతున్నారు. ఇదేకాకుండా జీసీసీ గోదాములు సైతం శిథిల దశకు చేరాయి.

రేషన్ బియ్యం పంపిణీకే పరిమితం

మారుమూల గిరిజన గ్రామాలలో ఉండే గిరిజనులకు నిత్యావసర సరుకులు సరసమైన ధరలకు అందుబాటులో ఉంచి దళారుల దోపిడిని అరికట్టాలని భావించిన ప్రభుత్వం గిరిజన గ్రామాలలో డీఆర్ డిపోలను ఏర్పాటు చేసింది. 1976లో గిరిజన సహకార సంస్థ ఏర్పాటు చేసి అంచెలంచెలుగా డీఆర్ డిపోలను ఏర్పాటు చేశారు. ఈ డీఆర్ డిపోలలో గ్రామీణ ప్రజలకు కావాల్సిన ఉప్పులు, పప్పులు, చక్కెర, నూనె, సబ్బులు తదితర నిత్యావసర సరుకులను అందుబాటులో ఉంచి సరసమైన ధరలకు విక్రయించాలని భావించినప్పటికీ.. ప్రభుత్వ ఉన్నతాధికారుల నిర్లక్ష్యం వల్ల గిరిజన సహకార సంస్థ ఆధ్వర్యంలోని డీఆర్ డిపోలు కేవలం ప్రజా పంపిణీ విధానం ద్వారా ప్రభుత్వం అందిస్తున్న రేషన్ బియ్యం పంపిణీ కేంద్రాలుగా మారాయి.

నిలిచిపోయిన అటవీ ఉత్పత్తుల సేకరణ

గిరిజన ప్రాంతాల ప్రజలు అడవులతో మమేకమై జీవిస్తూ తమకు అడవుల్లో లభించే అటవీ ఉత్పత్తులను సేకరించి విక్రయించుకునే విధంగా గిరిజన సహకార సంస్థ గతంలో కృషి చేసేది. ప్రస్తుతం గిరిజన సహకార సంస్థ పూర్తిగా ఆర్థిక ఇబ్బందుల్లో పడిపోవడంతో గత రెండేళ్లుగా అటవీ ఉత్పత్తుల సేకరణ నిలిపి వేసింది. అడవుల్లో లభించే ఇప్పపువ్వు, ఇప్పపరక, జిగురు, తేనే ఇలాంటివి గిరిజనులు సేకరించి జీసీసీ డీఆర్ డిపోలలో విక్రయించి తమకు కావాల్సిన నిత్యావసర సరుకులను వారు కొనుగోలు చేసుకుని వెళ్లేవారు. డీఆర్ డిపోల భవనాలు పాత భవనాలుగా మారడంతో అధికారులు విపత్కర పరిస్థితులు ఏర్పడడంతో అటవి ఉత్పత్తుల కొనుగోళ్లను గత రెండేళ్లుగా నిలిపి వేశారు.



● లోకారిలో ఉపయోగంలో లేని డీఆర్ డిపో

గోదాంలలో మూలుగుతున్న ఇప్పపువ్వు నిల్వలు

గిరిజనులు సేకరించిన అటవీ ఉత్పత్తులను కొనుగోలు

(తరువాయి 6వ పేజీలో....)

ఉన్నతాధికారులకు తెలిపాం : గుడిమల్ల సందీప్‌కుమార్, ఇన్‌చార్జీ డివిజనల్ మేనేజర్, ఉట్నూర్



ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలోని గిరిజన సహకార సంస్థ ఆధ్వర్యంలో కొనసాగుతున్న డీఆర్ డీపోల భవనాలు శిథిల దశకు చేరినట్లు ఉన్నతాధికారులకు తెలిపాం. డీఆర్ డిపోలను ఉన్నతీకకరించడానికి భవనాలు బాగుంటేనే సేవలు అందించే అవకాశం ఉంటుంది.

రూ.80 కోట్లతో ప్రతిపాదనలు : కోట్నాక్ తిరుపతి, జీసీసీ చైర్మన్

1976లో కట్టిన డీఆర్ డిపోల భవనాలు శిథిల దశకు చేరుకున్నాయి. కొత్త భవనాల నిర్మాణం కోసం, కొన్ని భవనాల మరమ్మతుల కోసం రూ.80కోట్లతో ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపించాం. తెలంగాణ రాష్ట్రంలో మూడు డివిజన్‌లో వంద గిరిజన కోఆపరేటివ్ సొసైటీల ఆధ్వర్యంలో డీఆర్ డిపోలు ఏర్పాటు చేసి మధ్య దళారుల నుంచి గిరిజనులను కాపాడడానికి కృషి చేయాల్సి ఉంది. గిరిజనులకు డీఆర్ డిపోల ద్వారా రేషన్ బియ్యం పంపిణీతో పాటు నిత్యావసర సరుకులు అందుబాటులో ఉంచేలా చర్చలు జరుపుతున్నాం. 2013లో కొనుగోలు చేసిన రూ.రెండు కోట్ల విలువ గల జిగురు (బంక), రూ.మూడు కోట్ల విలువ గల తెనే సైతం అప్పటి ఉన్న అధికారుల అలసత్వం వల్ల చెడిపోయింది. నిర్మల్‌లో తెనే ప్రాసెసింగ్ యూనిట్ ఉన్నప్పటికీ.. మార్కెట్‌కు అనుగుణంగా బ్రాండింగ్ చేసి విక్రయిస్తే లాభాలు వస్తాయి. ప్రస్తుతం జీసీసీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన 31 పెట్రోల్ బంకుల ద్వారా విక్రయాలు జరుగుతున్నప్పటికీ వర్కింగ్ క్యాపిటల్ లేకపోవడంతో ప్రజలకుస పూర్ణ సేవలు అందడం లేదు. సంపూర్ణ సేవలు అందించేలా ప్రయత్నాలు చేస్తున్నాం.





సిద్ధమైన అమ్మవారి విగ్రహం

దేవీ ఉత్సవాలకు సర్వం సిద్ధం

ఆదిలాబాద్ టౌన్, సెప్టెంబరు 21(ఆంధ్రజ్యోతి): దసరా శరన్నవరాత్రి ఉత్సవాలను జిల్లాలో వైభవంగా జరుపుకునేందుకు నిర్వాహకులు సర్వం సిద్ధం చేస్తున్నారు. ప్రతి యేటా మాదిరిగానే ఈ ఏడు సైతం ఉత్సవాలను ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లలో నిమగ్నమయ్యారు. సోమవారం నుంచి దేవీ శరన్నవరాత్రి ఉత్సవాలు ప్రారంభం కానున్న నేపథ్యంలో అందుకు తగ్గట్లుగా ఏర్పాట్లు పూర్తి చేస్తున్నారు. ఇప్పటికే వివిధ రూపాల్లో దుర్గ, శారద దేవి విగ్రహాలను కళాకారులూ రూపొందించగా... తుది పనుల్లో నిమగ్నమయ్యారు. అటు నిర్వాహకులు మండపాల వద్ద సర్వం సిద్ధం చేసుకుంటున్నారు. మండపాలను అందంగా రూపొందించే పనులు తుది దశకు చేరుకున్నాయి. తొమ్మిది రోజుల పాటు వివిధ రూపాల్లో అమ్మవారిని కొలిచేందుకు అవసరమైన పూజ సామగ్రిని ఖరీదు చేశారు. దీంతో పట్టణంలోని ప్రధాన రహదారులు కిక్కిరిసి కనిపించాయి. అటు గ్రామీణ ప్రాంతాలకు ఆదివారం ఉదయం నుంచే అమ్మవారి విగ్రహాలను తీసుకెళ్లారు. ఊరువాడా విగ్రహాలను ప్రతిష్ఠించి భక్తిశ్రద్ధలతో కొలవనున్నారు. పదిరోజుల పాటు వేడుకలు అంగరంగ వైభవంగా జరగనున్న నేపథ్యంలో ఎటు చూసినా కోలాహలం నెలకొంది.

నేడు సంత్ రామారావు మహరాజ్ విగ్రహ ప్రతిష్ఠకు భూమిపూజ

బోథ్, సెప్టెంబరు 21 (ఆంధ్రజ్యోతి): సోనాల మండల కేంద్రంలో సోమవారం ఉదయం 11 గంటలకు సంత్ సేవాలాల్ మహరాజ్ శిష్యుడు సంతు రామారావు మహరాజ్ విగ్రహ ప్రతిష్ఠాపనకు భూమిపూజ కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు మాజీ ఎంపీపీ తుల శ్రీనివాస్ తెలిపారు. ఈ కార్యక్రమానికి మండలంలోని బంజారా గ్రామ నాయక్‌లతో పాటు స్థానిక ప్రజాప్రతినిధులు హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆయన ఈ సందర్భంగా పేర్కొన్నారు.

పూల పండుగకు ఏర్పాట్లు పూర్తి

బజార్‌హత్నూర్, సెప్టెంబరు 21 (ఆంధ్రజ్యోతి): బతుకమ్మ పండుగ ప్రకృతి, భూమి, నీటితో మానవుల సంబంధాన్ని తెలియజేస్తుంది. మండల కేంద్రంలో సోమవారం బతుకమ్మ పండుగ కోసం ఆదివారం పూలను సేకరించడం, కొనుగోలు చేయడం, పూలను పేర్చి ముస్తాబు చేసే పనిలో మహిళలు బిజీబిజీగా కనిపించారు. అంతేకాకుండా బతుకమ్మ కోసం తంగేడు, గునుగు వంటి రంగురంగుల పూలను గ్రామాల్లోని వ్యవసాయ క్షేత్రాల్లో నుంచి సేకరించారు. అలాగే బంతి, చామంతి పూలను బహిరంగ మార్కెట్‌లో కిలో రూ.120లకు కొనుగోలు చేసి సాయంత్రం పూట ఆ పువ్వులతో అందంగా బతుకమ్మను పేర్చే పనుల్లో నిమగ్నమయ్యారు.



బజార్‌హత్నూర్ మండలం బండ్రేవ్ శివారులోని వ్యవసాయ చేనులో గునుగు పూలు కోస్తున్న రైతు

మహనీయుల ఆశయ సాధన కోసం పాటు పడాలి

● కలెక్టర్ రాజర్షి షా ● జిల్లావ్యాప్తంగా కొండా లక్ష్మణ్ బాపూజీ వర్ధంతి ● ఘన నివాళులు అర్పించిన అధికారులు, ప్రజాప్రతినిధులు



ఆదిలాబాద్ నివాళ్లర్పిస్తున్న కలెక్టర్ రాజర్షి షా, డీసీసీబీ చైర్మన్ అడ్డి భోజారెడ్డి



నేరడిగొండలో బాపూజీ చిత్రపటానికి నివాళ్లు అర్పిస్తున్న ఎమ్మెల్యే అనిల్ జాదవ్



బోథ్‌లో కొండా లక్ష్మణ్ బాపూజీకి నివాళ్లు అర్పిస్తున్న పద్మశాలి సంఘం సభ్యులు

ఆదిలాబాద్ టౌన్, సెప్టెంబరు 21(ఆంధ్రజ్యోతి): మహనీయుల ఆశయాల సాధన కోసం ప్రతీ ఒక్కరు పాటు పడాలని కలెక్టర్ రాజర్షి షా అన్నారు. కొండా లక్ష్మణ్ బాపూజీ 13వ వర్ధంతిని పురస్కరించుకుని జిల్లాకేంద్రంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో డీసీసీబీ చైర్మన్ అడ్డి భోజారెడ్డితో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన కొండా లక్ష్మణ్ బాపూజీ విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళి అర్పించారు. అనంతరం బాపూజీ చేసిన సేవలను స్మరించుకున్నారు. తెలంగాణ రాష్ట్ర సాధనలో కొండా లక్ష్మణ్ బాపూజీ పాత్ర స్ఫూర్తిదాయకంగా నిలుస్తుందని కలెక్టర్ పేర్కొన్నారు. మహనీయుల స్ఫూర్తితో ప్రతీఒక్కరు ముందుకు సాగాలని, జయంతి, వర్ధంతి సమయాల్లోనే కాకుండా ప్రతి నిత్యం వారి ఆశయాలను స్మరించుకోవాలన్నారు. 1967-1969లో తెలంగాణ రాష్ట్రం కోసం తన మంత్రి పదవిని సైతం త్యాగం చేసిన మహనీయుడు అని డీసీసీబీ చైర్మన్ అడ్డి భోజారెడ్డి అన్నారు. ఆయన స్ఫూర్తిని ప్రతీఒక్కరు కొనసాగించాలన్నారు. ఇదిలా ఉంటే అటూ పద్మశాలి సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన వర్ధంతి కార్యక్రమంలో ఎమ్మెల్యే పాయల శంకర్ పాల్గొన్నారు. ముందుగా కొండా లక్ష్మణ్ బాపూజీ విగ్రహానికి పూలమాలలు వేశారు. తెలంగాణ రాష్ట్రం సిద్ధించాలని, ప్రజలు బాగుండాలనే ఆలోచనతో బాపూజీ జీవితాంతం కృషి చేశారని అన్నారు. భౌతికంగా ఆయన మన మధ్య లేకపోయినా ఆయన ఆశయ సాధనకు కృషి చేయాల్సిన అవసరముందని, నూతనంగా నిర్మిస్తున్న కలెక్టరేట్‌కు కొండా లక్ష్మణ్ పేరును పెట్టాలన్న ప్రతిపదనను ప్రభుత్వం దృష్టికి తీసుకేళ్తామన్నారు. పద్మశాలి సంఘం అధ్యక్షురాలు మంచికట్ల ఆశమ్మ, బేత రమేష్, జిట్ట రమేష్, దసరి రమేష్, బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షులు చిక్కాల దత్తు, తదితరులు పాల్గొన్నారు. అలాగే కొండ లక్ష్మణ్ బాపూజీ వర్ధంతిని పురస్కరించుకుని నిర్వహించిన కార్యక్రమంలో మాజీమంత్రి జోగు రామన్న పాల్గొన్నారు. ఈ సందర్భంగా కొండ లక్ష్మణ్ బాపూజీ విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళ్లు సమర్పించారు. అనంతరం ఆ మహనీయుడు చేసిన త్యాగాలను స్మరించుకున్నారు. కార్యక్రమంలో బేత రమేష్, జిట్ట రమేష్, బొమ్మకంటి రమేష్, చిల్కా విలాస్, మోర ఆశన్న, దాసరి రమేష్, అనుముల ఊశన్న, ఆశమ్మ, ప్రశాంత్, నవత, జ్యోతి, అనసూయ, కటుకూరి శంకరమ్మ, చిలుక విలాస్, దాసరి ఆశన్న తదితరులు పాల్గొన్నారు. అటు బీసీ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో కొండ లక్ష్మణ్ బాపూజీ విగ్రహానికి పూలమాలలు వేసి ఘనమైన నివాళి సమర్పించారు. సంఘం అధ్యక్షుడు చిక్కాల దత్తు, తదితరులు పాల్గొన్నారు.

ఉద్యమాలకు ఊపిరూదిన బాపూజీ

నేరడిగొండ: ఆచార్య కొండా లక్ష్మణ్ బాపూజీ మూడు ఉద్యమాలకు ఊపిరుదారని ఎమ్మెల్యే అనిల్ జాదవ్ పేర్కొన్నారు. ఆదివారం ఆచార్య డాక్టర్ కొండా లక్ష్మణ్ బాపూజీ వర్ధంతిని నేరడిగొండలోని ఎమ్మెల్యే నివాసంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి ఎమ్మెల్యే పూలమాలలు వేసి నివాళులర్పించారు. కొండా లక్ష్మణ్ బాపూజీ జీవితం, పోరాటాలను గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ రాథోడ్ సజన్, శివారెడ్డి, కృష్ణారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

నేటి సమాజానికి ఆదర్శం

బోథ్: కొండా లక్ష్మణ్ బాపూజీ నేటి సమాజానికి ఆదర్శమని మాజీ జడ్పీటీసీ డాక్టర్ సంధ్యారాణి, మాజీ సర్పంచ్ సురేందర్ యాదవులు పేర్కొన్నారు. ఆదివారం మండల కేంద్రంలో కొండా లక్ష్మణ్ బాపూజీ వర్ధంతి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి ఆయన తెలంగాణ రాష్ట్రం కోసం చేసిన కృషి, రాజకీయ చతురత ఎంతో ఉందన్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల ప్రధాన కార్యదర్శి ఇల్లుక రాజు, యూత్ అధ్యక్షులు మేడ్పల్ మా ప్రవీణ్ పద్మశాలి సంఘం సభ్యులు పాల్గొన్నారు. మండలంలోని ధనూర్ గ్రామంలో పద్మశాలి సంఘం ఆధ్వర్యంలో కొండా లక్ష్మణ్ బాబూజీ వర్ధంతి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆయన ఆశయాలను కొనసాగించాలని పలువురు పిలుపునిచ్చారు. గ్రామ పెద్దలు, పద్మశాలి సంఘం సభ్యులు పాల్గొన్నారు.

అంతిమయాత్రలో గ్రామస్థులకు తప్పని తిప్పలు

జైనథ్, సెప్టెంబరు 21(ఆంధ్రజ్యోతి): మండలంలోని లక్ష్మీపూర్ గ్రామంలో ప్రజలకు కనీస సౌకర్యాలు అయిన రోడ్లు, మురికి కాల్వలు తదితర సౌకర్యాలు లేక గ్రామ ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. ఇటీవల కురిసిన భారీ వర్షాలకు లక్ష్మీపూర్ గ్రామానికి ప్రధాన రహదారి పూర్తిగా చెడిపోయింది. దీంతో పాటు మనిషి చనిపోతే చివరి అంతిమ యాత్ర అయిన శ్మశాన వాటిక మృతదేహాన్ని తీసుకు పోవడం రోడ్డు లేక లక్ష్మపూర్ గ్రామ ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. తాజాగా గ్రామానికి చెందిన సుభద్రబాయి శనివారం సాయంత్రం అనారోగ్యంతో మరణిస్తే మృతదేహాన్ని శ్మశాన వాటికకు రోడ్డు లేక గుంతల రాళ్ల రప్పలతో కూడిన బ్రిడ్జి పైనుంచి తీసుకెళ్ల వల్సిన పరిస్థితి నెలకొంది. ఇప్పటికైనా పాలకులు, అధికార యంత్రాంగం తక్షణం స్పందించి లక్ష్మీపూర్ గ్రామ శ్మశాన వాటికకు వెళ్లే బ్రిడ్జిని తక్షణం నిర్మించాలని లక్ష్మీపూర్ గ్రామప్రజలు, మహిళలు కోరుతున్నారు.



భారీ వర్షాలకు కొట్టుకపోయిన బ్రిడ్జి పైనుంచి శ్మశానానికి వెళ్తున్న గ్రామస్థులు

ఉపాధ్యాయ వృత్తి పవిత్రమైంది : ఎమ్మెల్యే

నేరడిగొండ, సెప్టెంబరు 21 (ఆంధ్రజ్యోతి): దేశ భవిష్యత్తు, నిర్మాణం ఉపాధ్యాయుల చేతుల్లోనే ఉందని విద్యతోనే దేశం అభివృద్ధి చెందుతుందని బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ పేర్కొన్నారు. ఆదివారం మండల కేంద్రంలో గల బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ నివాసంలో ఇటీవలే ఆదిలాబాద్ జిల్లా ఉత్తమ ప్రధానోపాధ్యాయుడిగా ఎన్నికైన జాదవ్ అంబారావు ఏహెచ్ఎస్ కుంటాలను సన్మానించారు. మాజీ ఎంపీపీ రాథోడ్ సజన్, శివారెడ్డి, సురేందర్, కృష్ణ నాయక్, నకుల్, పాండు, ధన్‌రాజ్, రాజేశ్వర్, సంజీవ్, పాఠశాల సిబ్బంది ఉన్నారు.

ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పనుల పరిశీలన

బోథ్, సెప్టెంబరు 21(ఆంధ్రజ్యోతి): ఇందిరమ్మ ఇంటిని ఎవరైతే ముందుగా నిర్మించుకుంటారో.. వారికి మొదటి కట్నం తానే తీసుకు వస్తానని కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి ఆడే గజేందర్ పేర్కొన్నారు. బోథ్‌లో నిర్మాణంలో ఉన్న ఇందిరమ్మ ఇళ్లను ఆదివారం ఆయన పరిశీలించి మాట్లాడారు. మార్కెట్ కమిటీ చైర్మన్ బొడ్డు గంగారెడ్డి, ఆత్మ చైర్మన్ రాజు యాదవ్, తదితరులున్నారు.

ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో టాలెంట్ టెస్ట్

బోథ్, సెప్టెంబరు 21 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో షహీద్ భగత్ సింగ్ స్ఫూర్తి అనే అంశంపై ఆదివారం టాలెంట్ టెస్ట్ నిర్వహించారు. ఇందులో 650 మంది విద్యార్థులు పాల్గొన్నారు.

నకిలీ పత్రాలతో భూ కుంభకోణం

● 'మెసేజ్ యువర్ ఎస్పీ'కి బాధితుల ఫిర్యాదుతో బట్టబయలు
● ముగ్గురు అరెస్టు.. రిమాండ్‌కు తరలింపు : మావల సీఐ

మావల, సెప్టెంబరు 21(ఆంధ్రజ్యోతి): పట్టణంలో కోట్ల విలువైన ఏడు ప్లాట్లను నకిలీ పత్రాలతో డబుల్ రిజిస్ట్రేషన్ చేసి ఆక్రమించిన ముఠా గుట్టును మావల పోలీసులు బట్టబయలు చేశారు. ఈ మేరకు మావల సీఐ స్వామి ఆదివారం వివరాలు వెల్లడించారు. పట్టణానికి చెందిన మిల్లింద్ మహారాష్ట్రకి చెందిన తనబావ విజయ్‌కు 2011లో దస్నాపూర్‌లోని సర్వే నెం.29/సి ప్లాట్లను మధ్యవర్తి సంజీవ్ సహాయంతో కొనుగోలు చేశారు. అయితే ఇదే మధ్యవర్తి సంజీవ్ 2022లో ఉష్కం రఘుపతి, నానం వెంకట రమణలతో కలిసి కుంభకోణానికి పాల్పడ్డారు. సబ్ రిజిష్టర్ అశోక్‌కు రూ.ఏడు లక్షల లంచం ఇచ్చి అవే ప్లాట్లను డబుల్ మళ్లీ రిజిష్టర్ చేశారు. అయితే మహారాష్ట్రకు చెందిన వ్యక్తి కావడంతో విజయ్‌ను ప్లాట్ల వైపు వస్తే చంపేస్తాం అని బెదరించసాగారు. దీంతో విజయ్ బావ మరిది మిలింద్ ఈనెల 19న మావల పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ మేరకు దర్యాప్తు చేపట్టిన మావల పోలీసులు నిందితులు నానం వెంకటరమణ, ఉష్కం రఘుపతి, సంజీవ్‌కుమార్‌లను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. మరో నిందితుడు సబ్ రిజిష్టర్ అశోక్ పరారీలో ఉన్నట్లు తెలిపారు. ఇందులో ఎస్సై ప్రవీణ్, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

పిడుగుపాటుకు మహిళా రైతు మృతి

జైనథ్, సెప్టెంబరు 21(ఆంధ్రజ్యోతి): పిడుగుపాటుకు మహిళా మృతి చెందిన ఘటన ఆదివారం బోరజ్ మండలంలోలో చోటు చేసుకుంది. గ్రామస్థులు, కుటుంబ సభ్యుల కథనం ప్రకారం.. బోరజ్ మండలంలోని పెండల్‌వాడ గ్రామంలో ఆదివారం సాయంత్రం ఉరుములు మెరుపులతో కూడిన భారీ వర్షం కురిసింది. ఉదయం వేళ నాగుల నిర్మల(33), భర్త సంతోష్ మరియు కుటుంబ సభ్యులతో కలిసి పొలం పనులకు వెళ్లారు. పనులు ముగించుకుని సాయంత్రం తిరుగు ప్రయాణం అయ్యారు. నిర్మల్ సెల్‌ఫోన్ మరిచిపోవడంతో పొలం వద్దకు వెళ్లింది. ఒక్క సారిగా ఉరుములు మెరుపులతో కూడిన భారీ వర్షం కురిసింది. నిర్మల్ సెల్‌ఫోన్ తీసుకుని చెట్టు కింద నిలబడింది. ఒక్కసారిగా పిడుగు పడటంతో ఆమె అక్కడికక్కడే మరణించింది. వర్షం తగ్గినా ఎంతకీ ఆమె రాకపోవడంతో కుటుంబ సభ్యులు పొలం వద్దకు వెళ్లి చూడగా పిడుగు పడి మరణించిన విషయాన్ని గమనిం చారు. దీంతో వారు పోలీసులకు సమాచారం అందించారు.



నాగుల నిర్మల (ఫైల్)

అనుమానాస్పద స్థితిలో యువకుడి మృతి

ఇచ్చోడ, సెప్టెంబరు 21(ఆంధ్రజ్యోతి) : ఈతకు వెళ్లిన యువకుడు అనుమానాస్పదంగా బావిలోనే మృత్యువాత పడ్డ సంఘటన మండలంలోని ముక్రా(బి) గ్రామంలో శనివారం చోటుచేసుకుంది. ఇచ్చోడ సర్కిల్ సీఐ బండారి రాజు తెలిపిన వివరాల ప్రకారం.. ఇచ్చోడ మండలంలోని ముక్రా(బి) గ్రామానికి చెందిన ఎనిమిది మంది యువకులు కలిసి గ్రామంలోని ఓ బావిలో ఈత కొట్టేందుకు వెళ్లగా అందులో ఓ యువకుడైన సయ్యద్ తోఫిక్ (19) మృతిచెందడం జరిగింది. దీంతో ఇచ్చోడ పోలీసు స్టేషన్‌లో అనుమానస్పద మృతిగా కేసు నమోదు చేయడం జరిగింది. ఈ ఘటనపై సోషల్ మీడియాలో దుష్ప్రచారం చేస్తున్నారని, దుష్ప్రచారాలు వ్యాప్తి చేయకుండా ఉండాలని సూచించారు. సోషల్ మీడియాలో మత విద్వేషాలు రెచ్చగొట్టేలా పోస్టులు పెట్టిన, వాట్సాప్ గ్రూప్‌లలో షేర్ చేసిన కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. అడ్మిన్లు తమ గ్రూప్‌లలో జరిగే విషయాలన గమనిస్తూ ఉండాలని ఎలాంటి విద్వేషాలు రెచ్చగొట్టేలా ప్రవర్తించిన సందేశాలను వెంటనే తొలగించాలని సూచించారు.

'మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలి'

ఆదిలాబాద్ టౌన్, సెప్టెంబరు 21(ఆంధ్రజ్యోతి): మత్తు, మాదకద్రవ్యాలకు యువత దూరంగా ఉంటూ మంచి భవిష్యత్తు నిర్మించుకోవాలని సీనియర్ సిటిజన్ అధ్యక్షుడు డాక్టర్ దేవిదాస్ దేశపాండే అన్నారు. ఆదివారం వయో వృద్ధుల సమాఖ్య కార్యాలయంలో హార్ట్‌ఫుల్ నెస్ మెడిటేషన్ శ్రీరామచంద్ర మిషన్ ఆధ్వర్యంలో నశముక్తి వికసిత్ భారత్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వయోవృద్ధులతో మాదక ద్రవ్యాల నిర్మూలపై ప్రతిజ్ఞ చేయింయారు. ప్రస్తుత కాలంలో యువత మత్తుకు అలవాటు పడీ జీవితాన్ని నాశనం చేసుకుంటుందని దేవిదాస్ దేశ్‌పాండే అన్నారు. తల్లిదండ్రులు వారి పిల్లలపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని కోరారు. చెడు అలవాట్లకు గురి కాకుండా నిరంతరం పర్యవేక్షించాలన్నారు. ఈ కార్యక్రమంలో హార్ట్ ఫుల్ నెస్ శిక్షకురాలు సునీత శేఖర్, గంగాధర్, పల్ల సత్యనారాయన, శంకర్, గంగయ్య, ప్రకాష్, దయాకర్ రెడ్డి, లక్ష్మణ్, రజీఉద్దిన్, పూర్ణచందర్, శైలజ, తదితరులు పాల్గొన్నారు.

చేనూ చెట్టు తిరిగి పూలను సేకరించే వాళ్లం



● అరుణ రాణి, ఎంపీడీవో, దిలావర్‌పూర్

ఆ రోజుల్లో బతుకమ్మ సంబరాల కోసం ఎదురు చూసే వాళ్లం. మా దోస్తులంతా కలిసి చేనూ చెట్టు తిరిగి పూలను సేకరించి తెచ్చే వాళ్లం. తీరొక్క పూలతో బతుకమ్మను పేర్చి పూజలు చేసి, చుట్టూ తిరుగుతూ చప్పట్లు వేస్తూ పాటలు పాడే వాళ్లం. బతుకమ్మను నిమజ్జనం చేసేందుకు చెరువులకు వెళ్లేటప్పుడు టిఫిన్ బాక్స్‌లో పిండి వంటలు తీసుకెళ్లి బతుకమ్మను నిమజ్జనం చేసి అందరం కలిసి తినేవాళ్లం.

గొంతులు కలిపి పాడితేనే అందం



● ముత్యాల లక్ష్మీ, పెద్దూర్, కడెం

బతుకమ్మ పండుగ అంటే 15 రోజుల నుంచే సందడి మొదలయ్యేది. పది రోజులు రోజుకో తీరుగా బతుకమ్మ పేర్చే వాళ్లం. నిమజ్జనం చేసేటప్పుడు వాయినాలు ఇవ్వడం గొప్ప అనుభూతి. చప్పట్లు కొడుతూ పాటలు పాడే వాళ్లం. ఆ పాటలు వినేందుకు ఊరంతా ఒక దగ్గరకు వచ్చేది. ఎంతైనా ఆ రోజులే వేరు.

లయాత్మకంగా చప్పట్లు...



● జక్కుల అమ్మవ్వ, పెద్దూర్, కడెం

ఆనాటి పాటలు చప్పట్లకు లయాత్మకంగా ఉండేవి. ఆ నాటి పద్ధతులు ఈనాటి తరానికి మోటయ్యాయి. ప్రాచీన ఆటలన్నీ కనుమరుగవుతున్నాయి. బాలబాలికలు, మహిళామణులు బాధ్యతగా భావిస్తేనే మనం ప్రాచీన పండుగలను సంప్రదాయకంగా జరుపుకోగలుగుతాం. 9 రోజుల పాటు వివిధ బతుకమ్మలు పేర్చి చివరి రోజు సద్దుల బతుకమ్మతో ఊరంతా ఒకే చోట పాటలు పాడుతూ ఆడేవాళ్లం.



బాసరకు ఉత్సవ శోభ

● నేటి నుంచి అమ్మవారి సన్నిధిలో దసరా వేడుకలు
● వివిధ రూపాల్లో దర్శనం ఇవ్వనున్న అమ్మవారు



భైంసాలో గణేష్‌నగర్ శ్రీరామ చైతన్య యూత్ ప్రతిష్ఠించడానికి తీసుకువచ్చిన దుర్గామాత ప్రతిమ

బాసర/భైంసా/ఖానాపూర్/ముథోల్/నిర్మల్‌రూరల్ సెప్టెంబరు 21 (ఆంధ్రజ్యోతి) : జ్ఞానసరస్వతి కొలువై ఉన్న బాసర పుణ్యక్షేత్రం దసరా నవరాత్రి ఉత్సవాలకు ముస్తాబయింది. 22 నుంచి అక్టోబర్ 2 వరకు పదిరోజుల పాటు జరగనున్న ఈ వేడుకల కోసం ఆలయ అధికారులు ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నారు. ఈ మహోత్సవాలను వీక్షించడానికి దేశం నలుమూలల నుండి లక్షలాది మంది భక్తులు రానున్నారు. ఈ నవరాత్రి పర్వదినాల్లో వేలాది మంది భక్తులకు అక్షర శ్రీకార పూజల కోసం దేశ నలుమూలల నుండి భక్తులు హాజరవుతారు. దసరా నవరాత్రుల్లో అమ్మవారు తొమ్మిది రోజులు తొమ్మిది రూపాల్లో దర్శనమిస్తారు. రోజుకో అలంకరణతో అమ్మవారు భక్తులను అనుగ్రహిస్తారు. మొదటి రోజున శైలపుత్రి, రెండవ రోజుల బ్రహ్మచారిని, మూడవ రోజు చంద్ర గంట, నాలుగవ రోజు కుష్మాండ, ఐదవ రోజు స్కందమాత, ఆరవ రోజున కాత్యాయని, ఏడవ రోజున కాలరాత్రి, ఎనిమిదవ రోజున మహాగౌరి, తొమ్మిదవ రోజున సిద్ధి ధాత్రిగా అమ్మవారు అలంకరిస్తారు. ఇక విజయదశమి నాడు అమ్మవారికి మహాభిషకం, ప్రత్యేక పూజలు నిర్వహిస్తారు.

దసరా నవరాత్రి రోజుల్లో ప్రతిరోజు సంస్కృతి కార్యక్రమాలను ఏర్పాటు చేశారు. ప్రతిరోజు రాత్రి ఆలయం వద్ద గల కోటి గాజుల మండపంలో కార్యక్రమాలు కొనసాగనున్నాయి. తెలుగు కళాకారులతో పాటు పొరుగున ఉన్న మహారాష్ట్ర కళాకారులతో భరతనాట్యం, భజన, కూచిపూడి, ఒగ్గు వంటి వివిధ ప్రాచీన సాంస్కృతిక కార్యక్రమాలు ఎప్పటిలాగే ఈ సారి ఏర్పాటు చేశారు. ఉత్సవాల సందర్భంగా ఆలయ విద్యుత్ దీపాలు, పూలతో అందంగా అలంకరించారు. భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకొని, ఆలయ అధికారులు అన్ని ఏర్పాట్లు చేస్తున్నారు.

అన్ని ఏర్పాట్లు చేశాం...



● అంజనాదేవి, ఆలయ ఈవో

ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ఏర్పాట్లు చేశాం. ఇంకా ఏమైనా లోటుపాట్లు ఎదురయితే వెంట వెంటనే చర్యలు తీసుకొని భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూస్తాం.



అమ్మవారి ఆలయానికి విద్యుత్ దీపాలతో అలంకరించిన దృశ్యం

ముస్తాబైన మండపాలు..

భైంసా : మున్సిపల్ కేంద్రమైన భైంసాలోని దుర్గాదేవి మండలిలు సోమవారం నుంచి ఆరంభమయ్యే శరన్నవరాత్రులకు సిద్ధమయ్యాయి. అమ్మవారి ప్రతిమలను ప్రతిష్ఠించేందుకు గాను మండలిల సభ్యులు పోటాపోటీగా ఏర్పాట్లు చేపట్టారు. మండలిని మించి మరో మండపాలను సర్వంగా సుందరంగా ముస్తాబు చేశారు. అందమైన ఆకృతులతో డెకరేషన్లు చేశారు. విద్యుత్ దీపాలను అలంకరించి శోభాయమానంగా తీర్చిదిద్దారు. 55కు పైగా భారీ సైజు విగ్రహాలను ప్రతిష్ఠాపనకు గాను తీసుకువచ్చారు. సోమవారం ముహూర్త కాలంలో అమ్మవారి విగ్రహాలు కొలువు తీరనున్నాయి. భైంసా పట్టణ పరిధిలో దుర్గాదేవి నవరాత్రి వేడుకలలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలకు తావీయకుండా ఉండేందుకు గాను పోలీసు శాఖ భారీ బందోబస్తు చర్యలు చేపట్టింది. ఎస్పీ డా.జానకీ షర్మిల, ఏఎస్పీ అవినాష్ కుమార్ నేతృత్వం లో పట్టణ సీఐ గోపినాథ్ బందోబస్తును పర్యవేక్షిస్తున్నారు. ఆదివారం టౌన్ సీఐ గోపినాథ్ పట్టణపరిధిలో విస్తృత పర్యటనలు చేపట్టి దుర్గామాత మండలీలు, ఆయా మార్గాల ను పర్యవేక్షించారు. టౌన్ ఎస్ఐలు నవనీత్‌రెడ్డి, సుప్రియ, నాగభూషణంలతో కలిసి చేపట్టాల్సిన భద్రతా చర్యలను పరిశీలించారు.

ఖానాపూర్ : పట్టణంలోని పద్మావతినగర్ కాలనీలో గల శ్రీశ్రీశ్రీ లక్ష్మీ వెంకటేశ్వర స్వామి ఆలయం ముస్తాబవుతోంది. ఈ సందర్భంగా ఆదివారం ఆలయ కమిటీ అధ్యక్షుడు అడ్డగట్ల రాజన్న ఓ ప్రకటన విడుదల చేశారు. వేడుకల సందర్భంగా నవరాత్రులపాటు పట్టణంలోని పలు ప్రధాన పురవీధులలో స్వామివారి పల్లకి ఊరేగింపును నిర్వహించనున్నట్లు తెలిపారు.

ముథోల్ : దసరా శరన్నవరాత్రుల వేడుకలు సోమవారం నుంచి నిర్వహించేందుకు భక్తులు మండపాలను ముస్తాబు చేశారు. ముథోల్‌తో పాటు మండలంలోని తరోడా, చించాల, వెంటాపూర్, బోరిగాం, చింతకుంట, వడ్తాల్, విట్టోలి, బ్రహ్మంగావ్, ఆష్టా, రాంటెక్, తదితర గ్రామాల్లో నిర్వాహకులు దుర్గామాత మండపాలను విద్యుద్దీపాలంకరణలతో తీర్చిదిద్దారు.

నిర్మల్‌రూరల్ : ఆలయ అధ్యక్షులు లక్కడి జగన్మోహన్ రెడ్డి భవాని జెండా ఆవిష్కరించారు. ఆలయ వ్యవస్థాపకులు కొండాజీ వెంకటాచారి మాట్లాడుతూ... దేవి శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా ప్రతిరోజు ప్రత్యేక పూజా కార్యక్రమాలు, అన్నదాన కార్యక్రమాలు, అమ్మవారికి తులాభారాలు, కుంకుమార్చన వంటి కార్యక్రమాలు ఉంటాయని ఆయన అన్నారు. కార్యక్రమంలో సాదం ఆనంద్, యాటకారి సాయన్న, ఆలయ పూజారి సందీప్, భక్తులు, తదితరులు పాల్గొన్నారు.

నేడు భైంసాలో బతుకమ్మల నిమజ్జనం

● అపరిశుభ్రంగా బతుకమ్మ ఘాట్ ● పట్టించుకోని అధికారులు



బతుకమ్మ ఘాట్ వద్ద నెలకొన్న దుస్థితి

భైంసా, సెప్టెంబరు 21 (ఆంధ్రజ్యోతి):మున్సిపల్ కేంద్రమైన భైంసాలో సోమవారం బతుకమ్మల నిమజ్జనోత్సవం జరుగనుంది. స్థానిక గడ్డెన్నవాగు ప్రాజెక్టు వద్ద గల బతుకమ్మ ఘాట్‌లో ఇక్కడి మహిళలు బతుకమ్మలను నిమజ్జనం చేయనున్నారు. ఆడపడుచులందరూ అత్యంత భక్తి శ్రద్దలతో పూల పండుగ బతుకమ్మను ఘనంగా నిర్వహించుకోవడం అనవాయితీ. అయితే ఇంతటి విశిష్టత గల బతుకమ్మల నిమజ్జనోత్సవానికి సంబంధించి ఇక్కడి గడ్డెన్నప్రాజెక్టు వద్ద గల బతుకమ్మ ఘాట్‌లో వ్యవస్థ మెరుగుదల, ఏర్పాట్లను మున్సిపల్ అధికార యంత్రాంగం విస్మరించింది. ఫలితంగా అపరిశుభ్ర వాతవరణంలోనే బతుకమ్మలను నిమజ్జనం చేయాల్సిన పరిస్థితులు నెలకొన్నాయి.

● ఘాట్‌మెట్లపై పేరుకుపోయిన నాచుతో ప్రమాదకరపరిస్థితులు

ఇక్కడి ఘాట్ వద్ద పరిస్థితి అధ్వానంగా, అపరిశుభ్రంగా మారింది. ఇటీవల ప్రాజెక్టులోకి అధికమొత్తంలో వరద నీరు చేరిన నేపథ్యంలో చెత్తా, చెదారం, వ్యర్థాలు కొట్టుకువచ్చి ఘాట్ మెట్లపై నిలిచిపోయాయి.. అంతేకాకుండా ఘాట్‌మెట్లపై నాచు పేరుకుపోయింది. మెట్లపై అడుగుపెడితే జారి పడిపోయే పరిస్థితులు నెలకొన్నాయి. బతుకమ్మలు నిమజ్జనం చేయాలంటే ఆడపడుచులు బెంలేలెత్తిపోయే పరిస్థితులు నెలకొన్నాయి.

● ఘాట్ వద్ద ఏర్పాట్లను విస్మరించిన మున్సిపల్ అధికారులు

వేలాది మంది మహిళలు ఇక్కడి ఘాట్ వద్ద బతుకమ్మలను నిమజ్జనం చేస్తారు. ఇంతటి ప్రాధాన్యత గల ఘాట్ వద్ద ఎలాంటి అసౌకర్యాలు కలుగకుండా , ఇబ్బందులు తలెత్తకుండా ఏర్పాట్లు చేపట్టాల్సిన మున్సిపల్ అధికారులు బాధ్యతారాహిత్యంగా వ్యవహరించారు. ఘాట్ వద్ద దుస్థితి నెలకొని ఉన్నప్పటికీ నిర్లక్ష్య పూరిత వైఖరి విధానాలతో వ్యవస్థ మెరుగుదలను విస్మరించారు. హిందూ ఉత్సవ సమితి, మున్నూరుకాపు మిత్ర మండలి శ్రేణులు బతుకమ్మ ఘాట్‌వద్ద పరిస్థితిని మెరుగుపరచాలని మున్సిపల్ అధికారులకు లిఖిత పూర్వక విజ్ఞప్తి చేసినప్పటికీ ప్రయోజనమేమి లేకుండా పోయింది. అలసత్వ విధానాలతో మున్సిపల్ అధికారులు బతుకమ్మఘాట్ వద్ద పరిస్థితులను మెరుగుపరచే చర్యలు చేపట్టలేదు. ఫలితంగా అపరిశుభ్రవాతవరణం, ప్రమాదకర పరిస్థితుల మధ్యనే బతుకమ్మలు నిమజ్జనం చేయాల్సిన పరిస్థితులు నెలకొని ఉన్నాయి. మున్సిపల్ అధికారుల తీరు పట్ల సర్వత్రా విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

కడెంలో కోతుల దాడిలో వృద్ధురాలికి గాయాలు

కడెం, సెప్టెంబరు 21 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని లింగాపూర్‌లో కోతుల దాడిలో దానవేని మల్లమ్మపై ఒక్కసారిగా కోతులు దాడిచేయడంతో మల్లమ్మకు గాయాలయ్యాయి. బాధితురాలిని వెంటనే ఖానాపూర్ ఆస్పత్రికి తరలించి చికిత్స అందించారు. గ్రామంలో కోతుల బెడద తీవ్రంగా ఉందని వాటిని అరికట్టాలని గ్రామస్థులు కోరుతున్నారు.

పిడుగు పడి ఎద్దు మృతి

సారంగాపూర్, సెప్టెంబరు 21 (ఆంధ్రజ్యోతి) : మండలంలో గల పొట్య గ్రామ పంచాయతీ అనుబంధ గ్రామమైన బండ రేవు తండాలో ఆదవారం పిడుగు పడడంతో ఆడే కృష్ణ అనే రైతు ఎద్దు పిడుగు పాటుతో అక్కడిక్కడే మృతి చెందినట్లు తండా వాసులు తెలిపారు. సుమారు ఎద్దు విలు రూ. 70వేలు ఉంటుందని తెలిపారు.

నర్సాపూర్(జి) : మండలంలో బూరుగుపల్లి(జి) గ్రామానికి చెందిన రైతుజాదవ్ రవీందర్ పొలం నుంచి ఎడ్లబండిపై వస్తున్న సమయంలో పిడుగుపాటుకు గురయ్యారు. ఈ దుర్ఘటనలో రవీందర్ రూ.50,000ల విలువైన ఎద్దు అక్కడికక్కడే మరణించింది. ఎడ్లబండిని నడుపుతున్న రవీందర్ తమ్ముడు రాందాస్‌కు తీవ్ర గాయాలయ్యాయి. రవీందర్ మాత్రం సురక్షితంగా బయటపడ్డారు. మాజీసర్పంచ్ విట్టాభాయ్ రైతుకు తక్షణమే రూ. 50,000ల నష్టపరిహారం అందించాలని డిమాండ్ చేశారు.

మజీద్ మినార్ ధ్వంసం

ముథోల్, సెప్టెంబరు 21 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రమైన ముథోల్‌లో ఆదివారం వేకువజామున పిడుగు పడడంతో మజీద్‌పై ఉన్న మినార్ ధ్వంసమైంది. మజీద్ నిర్వాహకుల కథనం ప్రకారం... ఉరుములు, మెరుపులతో కూడిన భారీవర్షం కురియడంతో ముథోల్‌లోని నయాబాది మజీద్‌పై ఉన్న మినార్‌పై పిడుగు పడింది. దీంతో మినార్ పాక్షికంగా ధ్వంసమైనట్లు వారు తెలిపారు. ఎలక్ట్రానిక్ పరికరాలు పిడుగు పాటు శబ్దంతో పాడైనట్లు తెలిపారు.

బ్యాటరీ దొంగల పట్టివేత

నిర్మల్ రూరల్, సెప్టెంబరు 21 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని అక్కాపూర్ గ్రామంలో తాండ్ర సాయన్న తన జేసీబీ మిషన్ పనిముగించుకొని ఊరిచివర పార్క్ చేసి వెళ్లగా ఇద్దరువ్యక్తులు రెండు బ్యాటరీలను శనివారం రాత్రి ఎత్తుకొని పోయారని, వారిని 24 గంటల్లో పట్టుకున్నామని రూరల్ ఎస్సై లింబాద్రి తెలిపారు. వారి వివరాల ప్రకారం మంజులాపూర్ గ్రామానికి చెందిన వరుసు అఖిల్, మహాలక్ష్మి వాడకు చెందిన నందకిషోర్ ఎత్తుకెళ్లారని వారిని పట్టుకుని రెండు బ్యాటరీలను రికవరీ చేసిన జ్యుడీషియల్ రిమాండ్‌కు తరలించినట్లు తెలిపారు.

కొండాలక్ష్మణ్ బాపూజీకి నివాళి

నిర్మల్‌రూరల్, సెప్టెంబరు 21 (ఆంధ్రజ్యోతి) : ఆచార్య కొండాలక్ష్మణ్ బాపూజీ 13వ వర్ధంతి సందర్భంగా జిల్లా కేంద్రంలోని కొండా లక్ష్మణ్ బాపూజీ విగ్రహానికి ఆదివారం పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించినట్లు తెలంగాణ పద్మశాలి ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షులు బూర ఉమాశంకర్, పద్మశాలి సంఘం అధ్యక్షులు చిలుక రమణ తెలిపారు. కార్యక్రమంలో రాష్ట్ర ఉపాధ్యక్షులు జల్దా రమణ, ఇతర పద్మశాలి సభ్యులు పాల్గొన్నారు.

ప్రమాదకరంగా ఉన్న గుంతల పూడ్చివేత



పిల్లర్‌గుంతలను పూడ్చివేస్తున్న గ్రామ పంచాయతీ సిబ్బంది

లక్ష్మణచాంద, సెప్టెంబరు 21 (ఆంధ్రజ్యోతి) : 'ప్రమాదకరంగా పిల్లర్ గుంతలు' శీర్షికతో ఆదివారం ఆంధ్రజ్యోతిలో వచ్చిన కథనానికి అధికారులు స్పందించారు. స్థానికంగా గల అంబేద్కర్ భవన సమీపంలో గల పిల్లర్ గుంతలలో నీరుచేరి చిన్నారులకు ప్రమాదకరంగా పరిణమించిం ది. ఈ విషయాన్ని ఆంధ్రజ్యోతి కథనం ద్వారా తెలుసుకున్న ఎంపీడీవో రాధారాథోడ్ గ్రామ పంచాయతీ సహకారంతో వాటిని జేసీబీతో పూడ్చి వేయించారు. తక్షణమే స్పందించిన ఎంపీడీవోకు స్థానికులు కృతజ్ఞతలు తెలిపారు. లక్ష్మణచాంద పంచాయతీ కార్యదర్శి సుధాకర్, కారోబార్ అక్బర్, పిల్లర్ గుంతలను పూడ్చివేయించేందుకు సహకరించారు.

హైదరాబాద్ తరలిన టీజేఎస్ నాయకులు

ఖానాపూర్, సెప్టెంబరు 21 (ఆంధ్రజ్యోతి) : టీజేఎస్ ఆధ్వర్యంలో హైదరాబాద్‌లోని గన్‌పార్క్ వద్ద ఆదివారం నిర్వహించిన కార్యక్రమంలో పాల్గొనేందుకు ఖానాపూర్ నుంచి టీజేఎస్ నాయకులు తరలివెళ్లారు. తెలంగాణజనసమితి రాష్ట్ర అధ్యక్షులు ప్రొఫెసర్ కోదండరాం ఆధ్వర్యంలో బియ్యం ఇచ్చే కార్యక్రమాన్ని నిర్వహించినట్లు ఆ పార్టీ నిర్మల్ జిల్లా అధ్యక్షుడు కడపత్రి తిలక్ రావు ఆంధ్రజ్యోతికి ఫోన్ ద్వారా తెలిపారు.

చిన్నారులు, తల్లిదండ్రులకు కౌన్సెలింగ్



తల్లిదండ్రులకు కౌన్సెలింగ్ ఇస్తున్న ఏఎస్పీ రాజేష్ మీనా

నిర్మల్‌రూరల్, సెప్టెంబరు 21 (ఆంధ్రజ్యోతి) : నిర్మల్ డివిజన్ పరిధిలోశనివారం మైనర్ డ్రైవింగ్ చేసిన చిన్నారులను గుర్తించి, వారు నడుపుతున్న వాహనాలను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. రహదారులపై అప్రమత్తత లేకుండా చిన్న వయస్సులో వాహనాలు నడపడం వల్ల తరచుగా ప్రమాదాలు జరుగుతున్న నేపథ్యంలో ఈ చర్యలు చేపట్టినట్లు పోలీసులు తెలిపారు. నిర్మల్ ఏఎస్పీ రాజేష్ మీనా ఆధ్వర్యంలో శనివారం వాహనాలు నడుపుతూ పట్టుబడిన చిన్నారులను వారి తల్లిదండ్రులకు ఆదివారం పట్టణంలోని టౌన్ పోలీస్ స్టేషన్‌లో కౌన్సెలింగ్ నిర్వహించారు. మైనర్ డ్రైవింగ్ వల్ల కలిగే ప్రమాదాలు, ప్రాణ నష్టం, కుటుంబాలపై పడే భారం, అలాగే చట్టపరమైన పరిణామాల గురించి విపులంగా వివరించారు. కౌన్సెలింగ్‌లో నిర్మల్ ఏఎస్పీ రాజేష్ మీనా, పట్టణ ఇన్‌స్పెక్టర్ ప్రవీణ్‌కుమార్, ఎస్సైలు, సిబ్బంది ఉన్నారు.

అలరించిన గుస్సాడి బృందం



గిరిజన సాంప్రదాయ నృత్యం

బాసర, సెప్టెంబరు 21 (ఆంధ్రజ్యోతి) : బాసర ఆర్జీయూకేటీ ప్రాంగణం ఆదివాసి సంప్రదాయ నృత్యకళలతో కళకళలాడింది. స్పిక్ మేకే హెరిటేజ్ క్లబ్ ఆధ్వర్యంలో జరిగిన గుస్సాడి నృత్య ప్రదర్శన విద్యార్థులు, ఉపాధ్యాయులు, సిబ్బంది అందరిని ఉత్సాహపరిచింది. కొమురం భీమ్ అసిఫాబాద్ జిల్లాకు చెందిన శ్రీ కనక సుదర్శణ్ ఆధ్వర్యంలోని ఆదివాసం బృందం, రంగుల రంజిత వేషాదారణలో డోలు-డప్పులు మోగింపులతో, శక్తివంతమైన చిందులతో నర్తించి అందరిని మైమరిపించింది. గ్రామీణ వాతావరణం, ప్రకృతి ఒడిలో పెరిగిన జీవన శైలి, పల్లెటూరి మమకారం ప్రతిబింబించిన ఈ నృత్యం విద్యార్థుల హృదయాలను ఆకట్టుకుంది. దాదాపు వెయ్యి మందికి పైగా విద్యార్థులు, ఆధ్యాపకులు ప్రత్యక్షంగా వీక్షించారు. ఈ సందర్భంగా విశ్వవిశ్వవిద్యాలయ ఉపకులపతి ప్రొఫెసర్ ఏ గోవర్ధన్ మాట్లాడుతూ గుస్సాడి వంటి ఆదివాసి కళలు మన వారసత్వం, మన మూలాలు, ఆధునిక యుగంలో కూడా ఇటువంటి కళలను సంరక్షించడం అత్యంత ముఖ్యమైనది, స్పిక్ మెకే విద్యార్థుల్లో సంస్కృతి పట్ల అవగాహన పెంచడంలో అద్భుత పాత్ర పోషిస్తుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో వీసీ గోవర్ధన్, అసోసియేట్ డీన్లు డా. మహేశ్, డా. విఠల్, స్పిక్ మేకే కోఆర్డినేటర్ డా. రాకేష్‌రెడ్డితో పాటు విశ్వవిద్యాలయ ఆధ్యాపకులు పాల్గొన్నారు.

ముథోల్‌లో భారీ వర్షం



కోతకు గురైన లోలెవెల్ వంతెన రోడ్డు

ముథోల్, సెప్టెంబరు 21 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రమైన ముథోల్‌తో పాటు మండలంలోని ఆయా గ్రామాల్లో శనివారం రాత్రి ఆదివారం మధ్యాహ్నం భారీ వర్షం కురిసింది. దీంతో లోతట్టు ప్రాంతాల్లో వర్షం నీరు చేరింది. అలాగే పంట చేలల్లో వర్షం నీరు చేరడంతో రైతులు దిగులు చెందుతున్నారు. ప్రస్తుతం సోయాపంట కోత దశలో ఉండగా ఈ వర్షం కారణంగా కోయలేకపోతున్నామని, దీంతో నష్టం జరిగే ప్రమాదం ఎక్కువ ఉందని రైతులు బెంగ పెట్టుకుంటున్నారు. అంతేకాకుండా ముథోల్-బోరిగాం గ్రామాల మధ్య గల లోలెవెల్ వంతెన పైనుంచి వర్షం నీరు అధికంగా ప్రవహించడంతో ఆదివారం లో-లెవెల్ వంతెన కోతకు గురైంది. దీంతో రాకపోకలు నిచిలిపోయాయి. విషయం తెలుసుకున్న ఆర్ఐ నారాయణ పటేల్ సంఘటనా స్థలానికి వెళ్లి లో లెవెల్ వంతెనను పరిశీలించారు.

సదర్మాట్ పరిసరాలు ఆహ్లాదకరం...



కుటుంబసభ్యులతో ప్రాజెక్టును సందర్శించిన ఎమ్మెల్యే



బోట్ విహారం చేస్తున్న ఎమ్మెల్యే

ఖానాపూర్, సెప్టెంబరు 21 (ఆంధ్రజ్యోతి) : అతి పురాతన ఆనకట్ట అయిన సదర్మాట్ పరిసర ప్రాంతాలు ఎంతో ఆహ్లాదకరంగా ఉంటాయని ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మబొజ్జుపటేల్ అన్నారు. ఆదివారం తన కుటుంబ సభ్యులతో కలిసి ఎమ్మెల్యే ఖానాపూర్ మండలంలోని మేడంపల్లి అడవుల్లో గల సదర్మాట్ ఆనకట్టను సందర్శించారు. ఎమ్మెల్యే బొజ్జు పటేల్ తన పిల్లలిద్దరికీ దసరా సెలవులు రావడంతో భార్య పిల్లలతో కలిసి ఆదివారం సరదాగా గడిపారు.

కడెం : కడెం నారాయణ రెడ్డి ప్రాజెక్టును ఆదివారం ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ కుటుంబ సమేతంగా కలిసి సందర్శించారు. అనంతరం కడెం ప్రాజెక్టులో కుటుంబ సమేతంగా బోట్ విహారం చేస్తూ కడెం ప్రాజెక్టు ప్రకృతి అందాలను తిలకించారు. ఆయన వెంట ఖానాపూర్ ఆత్మ కమిటీ డైరెక్టర్ జైల్ సింగ్, తదితరులున్నారు.

వరకట్న వేధింపులకు వివాహిత బలి

● తల్లిప్రేమకు దూరమైన మూడునెలల చిన్నారి



ఘటనా స్థలాన్ని పరిశీలిస్తున్న అడిషనల్ ఎస్పీ

కుంటాల, సెప్టెంబరు, 21 : (ఆంధ్రజ్యోతి) : మండలకేంద్రం కుంటాలకు చెందిన షికారి స్రవంతి (18) అనే వివాహిత మహిళ వరకట్న వేధింపులతో ఇంట్లో ఉరివేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డట్లు ఎస్సై అశోక్ తెలిపారు. కుటుంబసభ్యుల కథనం మేరకు స్రవంతికి గత ఏడాది కుం టాలకు చెందిన పోశెట్టితో వివాహం జరిగింది. వీరికి ఇటీవల మూడు నెలల క్రితం పాప జన్మించింది. వీరువురు ప్రేమించి పెళ్లి చేసుకున్నారు. పెళ్లి చేసుకున్నప్పటికీ స్రవంతికి వరకట్నం తీసుకురావాలని పోశెట్టి తరచూ వేధిస్తూ ఉండేవాడని, ఇటీవల వేధింపులు అధికమవడంతో శనివారం రాత్రి అందరూ నిద్రపోయిన తర్వాత ఆమె ఇంట్లో ఉరివేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డట్లు వారు తెలిపారు. ఉదయం లేచి చూడగా ఆమె ఉరివేసుకొని ఉండడాన్ని చూసిన ఆమె భర్త, కుటుంబసభ్యులు 108కు సమాచారం అం దించారు. 108 సిబ్బంది వచ్చి ఆమె మృతిచెందినట్లు గుర్తించడంతో పోలీసులకు సమాచారం అందించారు. ఆదివారం ఘటనా స్థలాన్ని భైంసా అడిషనల్ ఎస్పీ అవినాష్ కుమార్, సీఐ నైలు సందర్శించారు. తల్లి మృతితో మూడునెలల చిన్నారి ఒంటరైంది. చిన్నవయసులో తల్లి ప్రేమను కోల్పోయింది. చిన్నారిని చూసిన ప్రతి ఒక్కరూ కంటతడి పెట్టారు. తహసీల్దార్ కమల్‌సింగ్ పంచనామా నిర్వహించారు. మృతురాలి తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై తెలిపారు.

ఆశయం ఘనం.. ఆచరణలో శూన్యం

(5వ పేజీ తరువాయి...)

చేసిన ఇప్పపువ్వు నిలువలు గిరిజన సహకార సంస్థ గోదాములలో మూలుగుతున్నాయి. ఉట్నూర్ గోదాములో 4500 క్వింటాళ్లు, జన్నారం గోదాములో 350 క్వింటాళ్లు, ఆసిఫాబాద్ గోదాములో 446 క్వింటాళ్లు, ఇచ్చోడ గోదాములో 526 క్వింటాళ్లు, కామారెడ్డి జిల్లాకేంద్రంలోని గోదాములో 3500 క్వింటాళ్ల ఇప్పపువ్వు నిల్వలు టెండర్‌దారులు రాక గత రెండేళ్లుగా గోదాములలో మూలుగుతున్నాయి. ఫలితంగా వాటి నాణ్యత చెడిపోతున్నట్లు తెలుస్తుంది. గత సంవత్సరం ఇప్పపువ్వు కొనుగోలు చేయాలని భావించినప్పటికీ గోదాములు ఖాళీగా లేకపోవడంతో కొనుగోలు చేయలేక పోయారు. ఫలితంగా గిరిజనులు సేకరించిన ఇప్పపువ్వు దళారులకు అమ్ముకొని నష్టపోయారని తెలుస్తుంది. హైదరాబాద్‌లోని జీసీసీ మేనేజింగ్ డైరెక్టర్ స్థాయిలో ఇప్పపువ్వు నిలువల అమ్మకానికి టెండర్లు పిలిచినప్పటికీ కొనుగోలుదారులు ముందుకు రాకపోవడం వల్ల గిరిజన సహకార సంస్థకు రూ.1.80కోట్ల నష్టం ఏర్పడినట్లు తెలుస్తుంది. ఇది కాకుండా అటవీ ఉత్పత్తుల సేకరణ గోదాంలో రూ.4లక్షల విలువ గల 140 క్వింటాళ్ల ఇప్ప పపరక సైతం మూలుగుతుంది. ఇటీవల ఉట్నూర్‌లోని గిరిజన సహకార సంస్థ ఖాళీ సంచుల గోదాంలో జరిగిన అగ్ని ప్రమాదంతో రూ.15లక్షల మేర నష్టం జరిగింది.

నిధులు రాక నీరసం

గిరిజన సంక్షేమ శాఖ ఆధ్వర్యంలోని ఆశ్రమ పాఠశాలలు, వసతి గృహాలు, గురుకుల పాఠశాలల్లో చదువుకుంటున్న విద్యార్థుల భోజనం కోసం కావాల్సిన నిత్యావసర సరుకులను పంపిణీ చేస్తున్న గిరిజన సహకార సంస్థకు గిరిజన సంక్షేమ శాఖ అధికారులు సకాలంలో నిధులు మంజూరు చేయక పోవడంతో గిరిజన సహకార సంస్థ నీరసించి పోతుంది. సబ్బులు, నూనెలు, రిబ్బన్లు, దువ్వెనలు, పౌడర్, న్యాప్కిన్స్ లాంటి కాస్మోటిక్ వస్తువులను సరఫరా చరేస్తున్న గిరిజనన సహకార సంస్థకు గిరిజన సంక్షేమాధికారులు రూ.5 కోట్ల మేర రెండేళ్లుగా చెల్లించాల్సి ఉండడంతో గిరిజన సహకార సంస్థ ఆర్థిక ఇబ్బందుల నుంచి కోలుకోలేక పోతుంది. ఇప్పటికైనా ప్రభుత్వం ఉన్నతాధికారులు చొరవ తీసుకుని గిరిజన సహకార సంస్థను కాపాడాలని గిరిజన ప్రాంతాల ప్రజలు కోరుతున్నారు.

బాసరలో దొంగల బీభత్సం

బాసర, సెప్టెంబరు 21 (ఆంధ్రజ్యోతి) : బాసరలో దొంగలు శనివారం రాత్రి బీభత్సం సృష్టించారు. బస్టాండ్ సమీపంలోని శారదా బేకరితో పాటు రెండు ఇళ్లలో చోరికి పాల్పడి, లక్షల రూపాయల విలువయిన నగదు, బంగారం ఇతర వస్తువులను దోచుకెళ్లారు. ఈ వరుస దొంగతనాలతో స్థానిక ప్రజలు భయాందోళనకు గురవుతున్నారు. శనివారం రాత్రి గుర్తుతెలియని ముగ్గురు దొంగలు పట్టణంలోకి చొరబడి శారదా బేకరీని లక్ష్యంగా చేసుకున్నారు. గట్టి ఇనుప రాడ్లతో బేకరీ షట్టర్‌ను పగలగొట్టి లోపలికి ప్రవేశించారు. బేకరీ యజమాని తెలిపిన వివరాల ప్రకారం, దుండగులు రూ. 50వేల నగదుతో పాటు లక్షల విలువైన ఇతర వస్తువులను ఎత్తుకెళ్లారు. బేకరీలో చోరీతో పాటు, దొంగలు తాళం వేసిన మరో రెండు ఇళ్లలో కూడా చోరీలకు పాల్పడ్డారు. ఈ ఇళ్ల తాళాలను పగలగొట్టి, లోపల ఉన్న బంగారాం నగలు, నగదును దొంగలించారు. ఈ ఘటనతో బాసరలో భద్రతపై ప్రజల్లో ఆందోళన మొదయింది. ఈ ఘటనపై సమాచారం అందింకున్న స్థానిక ఎస్సై శ్రీనివాస్ వెంటనే సంఘటన స్థలాన్ని చేరుకొని పరిశీలించారు. బేకరీ యజమానులు, ఇంటి యజమానుల నుంచి వివరాలు సేకరించారు. పోలీసులు సీసీ కెమెరాలను పరిశీలించగా, ముగ్గురు వ్యక్తులు ఈ చోరీలకు పాల్పడినట్లు అనుమానిస్తున్నారు. దర్యాప్తు కొనసాగుతోందని ఎస్సై శ్రీనివాస్ తెలిపారు. ఈ ఘటనపై ప్రజలు తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పోలీసులు త్వరగా దొంగలను పట్టుకోవాలని, ప్రజల భద్రతకు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

ఆలయ ధ్వంసానికి పాల్పడిన దుండగులను శిక్షించాలి

ముథోల్, సెప్టెంబరు 21 (ఆంధ్రజ్యోతి) : లోకేశ్వరం మండలంలోని రాయపూర్ కాండ్లీలో బీరప్ప ఆలయ శిఖర ధ్వంసానికి పాల్పడిన దుండగులను కఠినంగా శిక్షించాలని ముథోల్ కురుమ సంఘం ఆధ్వర్యంలో డిమాండ్ చేశారు. మండల కేంద్రమైన ముథోల్‌లోని దన్గర గల్లీలోని పోచమ్మ ఆలయం వద్ద విలేకరుల సమావేశం ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా కురుమ సంఘం సభ్యులు దేవోజీ భూమేష్, ఎం. సాయినాథ్‌లు మాట్లాడుతూ... ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా అధికారులు చర్యలు చేపట్టాలని, దుండగులను తక్షణమే పట్టుకోవాలని కోరారు.

స్నేహితుడి కుటుంబానికి చేయూత

ఖానాపూర్, సెప్టెంబరు 21 (ఆంధ్రజ్యోతి) : తమతో కలిసి చిన్ననాడు చదువుకున్న ఓ స్నేహితుడు తిరిగిరాని లోకాలకు వెళ్లడంతో ఆయన మిత్రులంతా స్నేహితుని కుటుంబానికి చేయూతనందించారు. ఖానాపూర్ మండలంలోని సత్తనపల్లి గ్రామానికి చెందిన గుగ్లావత్ రాజేష్ నెల రోజుల క్రితం అనారోగ్యంతో మరణించాడు. దీంతో రాజేష్‌తో పాటు ముథోల్ గురుకుల పాఠశాలలో 2007-08 పదోతరగతి చదివిన విద్యార్థులంతా తలో కొంత డబ్బును పోగు చేసి రూ.50 వేలను ఆదివారం రాజేష్ కుటుంబ సభ్యులకు అందజేశారు. భవిష్యత్తులో సైతం అండగా ఉంటామని భరోసానిచ్చారు.



సీఆర్‌టీలకు వేతనాలు చెల్లించాలి

కడెం, సెప్టెంబరు 21 (ఆంధ్రజ్యోతి) : సీఆర్‌టీల పెండింగ్ వేతనాలను చెల్లించాలని ఎస్సీ, ఎస్టీ ఉపాధ్యాయ సంఘం ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా అధ్యక్షులు భూక్యా రాజేష్ నాయక్ డిమాండ్ చేశారు. గత ఆరు నెలలుగా వేతనాలు అందకపోవడంతో సీఆర్‌టీలు ఆర్థిక ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు. ప్రభుత్వం వెంటనే వారి వేతనాలను విడుదల చేయాలని లేకుంటే ఆందోళన కార్యక్రమాలు మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు.





పల్లకి సేవలో పాల్గొన్న ఎమ్మెల్యే రామారావ్ పాటిల్ పక్కన గంగేశ్వర్ మహరాజ్

ఆధ్యాత్మిక చైతన్యానికి పల్లకీయాత్ర

● మదనాపూర్ గంగేశ్వర్ మహరాజ్

భైంసా, సెప్టెంబరు 21 (ఆంధ్రజ్యోతి): లోక కల్యాణార్థం, ఆధ్యాత్మిక చైతన్యం కోసం గాను ప్రతియేటా పల్లకియాత్ర నిర్వహిస్తున్నట్లుగా మదనాపూర్ గంగేశ్వర్ మహరాజ్ పేర్కొన్నారు. శనివారం కుభీర్ మండలంలోని మర్లగొండ గాలిసింగ్ తండా నుంచి బాసర అమ్మవారి క్షేత్రానికి ప్రారంభమైన పల్లకియాత్ర ఆదివారం మధ్యాహ్నం భైంసాకు చేరుకుంది. ముథోల్ ఎమ్మెల్యే పవార్ రామారావ్ పాటిల్ పట్టణ సరిహద్దులో పల్లకియాత్రకు ఎదురేగి స్వాగతం పలికారు. బీజేపీ భైంసా పట్టణ కమిటీ అధ్యక్షుడు రావుల రాము, మాజీ కో-ఆప్షన్ సభ్యుడు సోలంకే భీంరావ్, మార్కెట్ కమిటీ మాజీ చైర్మెన్ రాజేష్ బాబులతో కలిసి ఎమ్మెల్యే పాటిల్ పల్లకీ సేవా కార్యక్రమంలో పాల్గొన్నారు. ఎమ్మెల్యే పాటిల్ అహ్వానం మేరకు మదనాపూర్ గంగేశ్వర్ యాత్ర బృందం ఎస్ ఎస్ జిన్నింగ్‌కు చేరుకొని మధ్యాహ్నం వేళలో బస చేశారు. ఈ సందర్భంగా డివిజన్ పరిధిలోని వివిధ ప్రాంతాలకు చెందిన భక్తులు అధిక సంఖ్యలో ఇక్కడకు చేరుకొని మహరాజ్ ఆశీర్వచనాలు పొందారు. ఇందులో భాగంగా మదనపూర్ గంగేశ్వర్ మహరాజ్ భక్తులనుద్దేశించి మాట్లాడారు. ఆపద సమయంలో కాకుండా అన్ని వేళల్లోనూ ఆలయాలను సందర్శించుకుంటూ భక్తిభావాలతో నడుచుకోవాలని సూచించారు. సత్‌బుద్ధితో సన్మార్గంలో పయనిస్తే అన్నింటా సత్ఫలితాలుంటాయన్నారు. సేవాభావాలను అలవర్చుకొని తోటి వారి కష్టసుఖాల్లో పాలుపంచుకోవాలన్నారు. లోకకల్యాణం కోసం ప్రతిఒక్కరూ సత్కార్యాలు చేయాలన్నారు. అనంతరం మహరాజ్ పల్లకియాత్ర బృందం బాసరకు పయనమైంది.









మరాఠాల సంక్షేమానికి పాటుపడతా

● భైంసా మరాఠా సంఘం అధ్యక్షుడు కదం మోహన్‌రావ్ పాటిల్

భైంసా, సెప్టెంబరు 21 (ఆంధ్రజ్యోతి): బాధ్యతాయుతమైన విధానాల ద్వారా మరాఠాల సంక్షేమానికి అంకితభావంతో పాటుపడుతానని ఆ సంఘం భైంసా పట్టణ కమిటీ నూతన అధ్యక్షుడు కదం మోహన్‌రావ్ పాటిల్ పేర్కొన్నారు. ఆదివారం భైంసాలోని చత్రపతి శివాజీ మహారాజ్ మరాఠా సంఘ భవనంలో పట్టణ నూతన కార్యవర్గ ఎన్నిక ఏకగ్రీవంగా జరిగింది. ఇందులో గౌరవ అధ్యక్షుడిడిగా జాదవ్ పుండలీక్‌రావ్ పాటిల్, అధ్యక్షుడిగా కదం మోహన్ రావ్ పాటిల్, ఉపాధ్యక్షులుగా సూర్యవంశీకాశీరామ్ పాటిల్, కదం సంపత్ పాటిల్, ప్రధాన కార్యదర్శిగా సిందే లక్ష్మణ్‌రావ్ పాటిల్, సహ కార్యదర్శిగా జాదవ్ సాయికృష్ణ పాటిల్, కోశాధికారిగా సిందే దర్శన్ పాటిల్‌తో పాటు పలువురు సలహాదారులుగా ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో సంఘం అధ్యక్షుడు కదం మోహన్‌రావ్ పాటిల్ మాట్లాడుతూ సంఘ సభ్యులంతా సంఘటితంగా ముందుకు సాగుతూ ఒకరి కష్టసుఖాల్లో మరొకరు పాలుపంచుకోవాలని అకాంక్షించారు. అర్హులందరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాల ద్వారా లబ్ధి చేకూరేలా చర్యలు చేపడుతామని పేర్కొన్నారు. మరాఠాలను ఓబీసీలో చేర్చాలనే డిమాండ్‌తో జరిగే ప్రతి కార్యక్రమానికి సంఘ సభ్యులందరూ బాధ్యతాయుత భాగస్వామ్యాన్ని అందించాలని సూచించారు. సమావేశం అనంతరం సంఘ ప్రతినిధులు నూతనంగా ఎన్నికైన కార్యవర్గసభ్యులకు ఘనంగా సన్మానించి జ్ఞాపికలు బహూకరించారు.



మోహన్‌రావ్‌ను సన్మానిస్తున్న మరాఠ సంఘ ప్రతినిధులు

పోరాట యోధుడు కొండా లక్ష్మణ్

● భైంసా పద్మశాలి సంఘం అధ్యక్షుడు మహేష్



భైంసాలో బాపూజీ చిత్ర పటం వద్ద నివాళులర్పిస్తున్న పద్మశాలి సంఘం ప్రతినిధులు

భైంసా, సెప్టెంబరు 21 (ఆంధ్రజ్యోతి): నిజాం నిరంకుశ పాలనకు వ్యతిరేకంగా, స్వాతంత్ర ఉద్యమ పోరాటంతో పాటు తెలంగాణ కోసం మార్గదర్శకమైన పోరుబాట చేపట్టిన యోధుడు కొండా లక్ష్మణ్ బాపూజీని భైంసా పద్మశాలి సంఘం అధ్యక్షుడు సట్టవార్ మహేష్ కొనియాడారు. ఆదివారం కొండా లక్ష్మణ్ బాపూజీ వర్ధంతిని పురస్కరించుకొని స్థానిక మార్కండేయ భవనంలో కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర సాధన కోసం గాను బాపూజీ తన వృద్ధాప్యాన్ని కూడా పక్కనపెట్టి ఉద్యమించాడని తెలిపారు. ఈ సందర్భంగా పట్టణ కమిటీ అధ్యక్షుడు సట్లవార్ మహేష్ ఆధ్వర్యంలో పద్మశాలి సంఘం శ్రేణులు కొండా బాపూజీ చిత్ర పటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఆయన ఆత్మకు శాంతి చేకూరాలని రెండు నిముషాలు మౌనం పాటించారు.

గజ్జలమ్మ ఆలయానికి పోటెత్తిన భక్తులు

కుంటాల, సెప్టెంబరు 21 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రం కుంటాల స్థానిక గజ్జలమ్మ ఆలయానికి ఆదివారం భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. గజ్జలమ్మకు ప్రీతి పాత్రమైన నైవేద్యాలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు.



గజ్జలమ్మ ఆలయంలో పూజలు నిర్వహిస్తున్న భక్తులు

పూల పండుగ.. చామంతి నిండుగ

ఇచ్చోడ, సెప్టెంబరు, 21 (ఆంధ్రజ్యోతి) : మహాలయ అమావాస్య నుంచి దుర్గాష్టమి వరకు తొమ్మిది రోజులపాటు బతుకమ్మను ఆడుతూ పాడుతూ కొలవడం అనవాయితీ. తెలంగాణ పెద్ద పండుగల్లో ఒకటైన బతుకమ్మ వేడుకలకు అనుగుణంగా ఇచ్చోడ మండలంలోని ధరంపురి గ్రామంలో రైతులు చామంతి పూలను సాగు చేస్తున్నారు. నేటి నుంచి బతుకమ్మ వేడుకలు ప్రారంభం కానున్న నేపథ్యంలో పూలను విక్రయించుకునేందుకు సిద్దమయ్యారు. ధరంపురి గ్రామం వద్ద ఓ రైతు సాగుచేసిన తోట ఆకుపచ్చ చెట్టుకు పసుపు పచ్చ చామంతి పూలతో ఆకర్షణీయంగా కనిపిస్తుంది. అటుగా వెళ్లే వారికి ఆ పూలవనం స్వాగతం పలుకుతున్నట్లు కనిపిస్తుంది.



ధరంపురి గ్రామంలోని చామంతి పూలవనం





కల్లూర్‌లో బాపూజీ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న గ్రామస్థులు

బాపూజీకి ఘన నివాళి

కుంటాల, సెప్టెంబరు, 21 : (ఆంధ్రజ్యోతి) : కుంటాల మండలంలోని కల్లూరు గ్రామంలో కొండా లక్ష్మణ్ బాపూజీ వర్ధంతిని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన సేవలను పలువురు కొనియాడారు. స్వాతంత్ర సమరయోధులుగా నిజాం సర్కార్‌కు వ్యతిరేకంగా పోరాడిన వీరుడిగా తెలంగాణ రాష్ట్రం ఏర్పాటు తొలి, మలి దశ ఉద్యమాల్లో కీలక పాత్ర పోషించిన వ్యక్తిగా ఆయన సేవలను కీర్తిస్తూ పద్మశాలి సంఘం తరపున కార్యక్రమం చేపట్టారు. ఈ కార్యక్రమంలో అధ్యక్షులు గుద్దేటి గంగాధర్, కోశాధికారి సాయిరాం, శివకుమార్, నాయకులు, గ్రామస్థులు, యువకులు ఉన్నారు.















మంత్రి పర్యటన వాయిదా

మామడ, సెప్టెంబరు 21 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రంలో మంత్రి పర్యటన వాయిదా పడింది. మండల కేంద్రంలో సోమవారం నూతనంగా నిర్మించిన డాక్టర్ బీఆర్.అంబేద్కర్ విగ్రహావిష్కరణను మంత్రి వివేక్ వెంకటస్వామి ఆవిష్కరించాల్సి ఉండగా వాయిదా వేసినట్లు అంబేద్కర్ యువజన సంఘం నాయకులు తెలిపారు. రెండు మూడు రోజులుగా భారీ నుంచి అతి భారీ వర్షాల కారణంగా మంత్రి పర్యటనను రద్దు చేసుకున్నట్లు ఈ సందర్భంగా నాయకులు వివరించారు.









నిర్మల్ దిక్సూచి 'ఏలేటి'!


ఏలేటి మహేశ్వర్ రెడ్డి

నిర్మల్, సెప్టెంబరు 21 (ఆంధ్రజ్యోతి) : భారతీయ జనతా పార్టీ శాసన సభపక్ష నేత, నిర్మల్ శాసన సభ్యులు ఏలేటి మహేశ్వర్ రెడ్డి రాజకీయాల్లో అజాత శత్రువుగా ముద్ర వేసుకుంటున్నారు. విద్యాసంస్థల అధినేతగా పిన్న వయసులోనే రాజకీయాల్లోకి వచ్చిన ఏలేటి నిర్మల్ నియోజకవర్గ అభివృద్ధికి దిక్సూచిగా మారారు. నిరంతరం నిర్మల్ నియోజకవర్గ ప్రజల సంక్షేమం నియోజకవర్గ అభివృద్ధి కోసం అహర్నిశలు శ్రమిస్తున్నారు. మిగతా రాజకీయ నేతలకు భిన్నంగా ఆడిన మాట తప్పకుండా నియోజకవర్గ ప్రజలే తన దైవంగా ముందుకు సాగుతున్నారు. ఇక రాజకీయంగా అతి చిన్న వయస్సులోనే జాతీయ స్థాయి పార్టీ అయిన భారతీయ జనతా పార్టీ తెలంగాణ శాసనసభా పక్ష నేతగా కీలక బాధ్యతలు చేపట్టారు. ప్రధాని నరేంద్ర మోదీ, పార్టీ అధ్యక్షుడు జేపీ నడ్డా, పార్టీ అగ్రనేత అమిత్ షాల దారిలో తనకు అప్పగించిన బాధ్యతలను సంపూర్ణంగా మోస్తూ ముందుకు సాగుతున్నారు. ప్రభుత్వ పథకాల్లో జరుగుతున్న అవినీతిని ఎండగడుతూ పాలకులకు కంటి మీద కునుకు లేకుండా చేస్తున్నారన్న పేరు సంపాదించారు. భవిష్యత్తులోనూ తన నిర్మల్ నియోజకవర్గంతో పాటు, తెలంగాణలో పార్టీ విస్తరణ... ప్రభుత్వ పథకాలను ప్రజలకు చేరవేయడం, రాష్ట్ర అభివృద్ధి నిర్మాణంలో కీలక బాధ్యతలను చేయాలన్న తలంపుతో ముందుకు సాగుతున్నారు.

ఏలేటి మహేశ్వర్ రెడ్డి జన్మదిన వేడుకలు

నర్సాపూర్(జి), సెప్టెంబరు 21 (ఆంధ్రజ్యోతి) : నిర్మల్ శాసన సభ్యులు, తెలంగాణ రాష్ట్ర బీజేపీ శాసన సభా పక్ష నేత ఏలేటి మహేశ్వర్ రెడ్డి జన్మదినాన్ని పురస్కరించుకుని సోమవారం ఉదయం 10 గంటలకు నర్సాపూర్ మండల కేంద్రంలో వేడుకలు జరుగనున్నాయి. కార్యక్రమంలో పాల్గొని తమ ప్రియతమ నాయకుడికి జన్మదిన శుభాకాంక్షలు తెలియజేయాలని కోరుతూ నాయకులు, కార్యకర్తలను బీజేపీ మండల అధ్యక్షులు నరేందర్ బర్కుంట ఆహ్వానించారు. మహేశ్వర్ రెడ్డి అభిమానులు, కార్యకర్తలు అందరూ ఈ వేడుకలకు హాజరు కావాలని ఆయన కోరారు.

వచ్చే మూడురోజులు
భారీ వర్షాలు

- జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్

నిర్మల్ రూరల్, సెప్టెంబరు 21 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో వాతావరణ శాఖ హెచ్చరికల నేపథ్యంలో వచ్చే మూడురోజులపాటు భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని కలెక్టర్ అభిలాష అభినవ్ ఆదివారం సాయంత్రం ఒక ప్రకటనలో తెలిపారు. వర్షాలు అధికంగా కురిసే అవకాశం ఉన్నందున ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. అవసరమైతే తప్ప ఇళ్ల నుంచి బయటకు వెళ్లకుండా జాగ్రత్తలు పాటించాలని, వాగులు, వంకలు, నదులు పొంగి పొర్లే పరిస్థితుల్లో వాటిని దాటే ప్రయత్నం చేయరాదని కలెక్టర్ సూచించారు. తక్కువ ఎత్తులోని ప్రాంతాల్లో నీరు నిలిచే అవకాశం ఉండడంతో ప్రజలు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ఎటువంటి అత్యవసర పరిస్థితులు తలెత్తినా వెంటనే తహసీల్దార్, ఎమ్మార్వో, ఎంపీడీవోలకు సమాచారం ఇవ్వాలని, కంట్రోల్ రూమ్ నెంబర్ 9100577132 ద్వారా కూడా సంప్రదించవచ్చని కలెక్టర్ తెలిపారు. ఇప్పటికే జిల్లా యంత్రాంగం అన్ని శాఖలతో సమన్వయం చేసుకుని అప్రమత్తంగా ఉందని కలెక్టర్ ఈ సందర్భంగా స్పష్టం చేశారు.









గడ్డెన్నవాగు ప్రాజెక్టు నుంచి 2,200 క్యూసెక్కుల నీటి విడుదల

భైంసా, సెప్టెంబరు 21 (ఆంధ్రజ్యోతి) : ఎగువ ప్రాంతంలో కురుస్తున్న వర్షాల మూలంగా గడ్డెన్న వాగుప్రాజెక్టులోకి ఆదివారం 2000 క్యూసెక్కుల వరద నీరు వచ్చింది. ఈ సమయంలో ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటి మట్టం 358.7 మీటర్లతో పూర్తిస్థాయి నీటి సామర్థ్యం 1.83 టీఎంసీలతో నిండుకుండలా మారింది. దీంతో ప్రాజెక్టు నిర్వాహణాధికారులు ఆదివారం ఉదయం వేళలో వరద నీటి చేరిక పరిస్థితిని సమీక్షించారు. అనంతరం ప్రాజెక్టు వరదగేట్‌ను ఎత్తి సుద్దవాగులోకి 2200 క్యూసెక్కుల నీటిని వదిలిపెట్టారు. వరద నీటి చేరికకు అనుగుణంగా స్పిల్‌వే గేట్ల ద్వారా నీటి విడుదల కొనసాగింపుపై నిర్ణయం తీసుకుంటామని ప్రాజెక్టు అధికారులు వెల్లడించారు.

బతుకమ్మ ఉత్సవాలకు ప్రత్యేక ఏర్పాట్లు

నిర్మల్ రూరల్, సెప్టెంబరు 21 (ఆంధ్రజ్యోతి) : జిల్లా వ్యాప్తంగా బతుకమ్మ ఉత్సవాలను అంగరంగ వైభవంగా నిర్వహించేందుకు జిల్లా యంత్రాంగం ప్రత్యేక సన్నాహాలు ప్రారంభించింది. కలెక్టర్ అభిలాష అభినవ్ ఆదేశాల మేరకు ఆదివారం నుంచి 30 వరకు జరిగే ఉత్సవాలకు అన్ని శాఖల ఆధ్వర్యంలో ఏర్పాట్లు జరుగుతున్నాయి. రాష్ట్ర ప్రభుత్వం సూచించిన విధంగా ప్రజలు ఉత్సవాలను సుఖశాంతుల మధ్య జరుపుకునేలా తాగునీరు, విద్యుత్, పారిశుద్ధ్యం, వైద్య శిబిరాలు, రవాణా సౌకర్యాలు కల్పించనున్నారు. సద్దుల బతుకమ్మ సెప్టెంబరు 30న నిమజ్జన ఘాట్ల వద్ద కట్టుదిట్టమైన భద్రతా చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచనలు జారీ చేశారు. ఈ మేరకు అధికారులు ఏర్పాట్లు చేశారు.



ముధోల్‌కు చేరిన మహారాజ్ పాదయాత్ర

ముథోల్, సెప్టెంబరు 21 (ఆంధ్రజ్యోతి) : మహారాష్ట్రలోని నాందేడ్ జిల్లా కిన్వట్ తాలూకా మదనాపూర్‌కు చెందిన గంగేశ్వర్ మహారాజ్ పాదయాత్ర ఆదివారం సాయంత్రం ముథోల్‌కు చేరుకుంది. ఆదివారం ఉదయం కుబీర్ మండలం గాల్‌సింగ్ నాయక్ తండాలోని జగదాంబ ఆలయం నుంచి సేవాలాల్ మహారాజ్ పాదుక పల్లకితో బాసర వరకు ఈ పాదయాత్ర చేపట్టినట్లు నిర్వాహకులు తెలిపారు. ఆదివారం రాత్రి ముథోల్‌లోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో బసచేసి సోమవారం ఈ పాదయాత్ర బాసరకు చేరుకుంటుంది. బాసర గోదావరి నదిలో పుణ్య స్నానాలు ఆచరించి అమ్మవారిని దర్శించుకోనున్నట్లు తెలిపారు. అనంతరం గోదావరి నది జలాలను గాల్‌సింగ్ నాయక్ తండాలోని జగదాంబ ఆలయానికి తీసుకెళ్లి దేవి నవరాత్రులలో భాగంగా ఘటాలను ప్రతిష్ఠించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. వీరికి ముథోల్‌లో బంజారా సేవాసంఘం జిల్లా నాయకులు నరేందర్ రాథోడ్, నర్సాగౌడ్, విశ్వనాథ్ పటేల్‌తో పాటు పలువురు నాయకులు, భక్తులు, తదితరులు మహారాజ్‌కు స్వాగతం పలికారు.





